క్లుప్తంగా

కొనుగోళ్లు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న డీపీఎం వేణుగోపాల్

దండేపల్లి: మబ్బులు వస్తున్నందునా వరి కొనుగోళ్ల వేగవంతం చేయాలని డీపీఎం వేణుగోపాల్ నిర్వాహకులకు సూచించారు. దండేపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని పెద్దపేట, ధర్మారావ్‌పేట, లక్ష్మీకాంతపూర్, నెల్కివెంకటాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను గురువారం సందర్శించారు. కొనుగోళ్ల తీరును పరిశీలించారు. ఇప్పటివరకు చేసిన కొనుగోళ్లు, తదితర వివరాలపై ఆరా తీశారు. ట్యాబ్ ఎంట్రీ పనులు ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని సూచించారు. ఆయన వెంట సీసీ తిరుపతి ఉన్నారు.

'ప్రభుత్వ టీచర్ల సర్దుబాటు విరమించుకోవాలి'

మంచిర్యాలఅర్బన్: కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల డిప్యూటేషన్(సర్దుబాటు) ఆదేశాలను విరమించుకోవాలని ఎస్టీయూటీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, బాపు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సమగ్రశిక్ష ఉద్యోగులు 18రోజులుగా సమ్మె చేస్తుంటే సమస్యను పరిష్కరించకుండా, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను సర్దుబాటు చేయటం సరికాదన్నారు. టీచర్ల డిప్యూటేషన్‌తో సర్కారు బడి.. కేజీబీవీలలో చదివే విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను రద్దుచేసి సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పాతమంచిర్యాల: ఈ నెల 28న హైదరాబాద్‌లో నిర్వహించే సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ విలీన మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అజ్మీరా లాల్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో మహాసభ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు మేకల రామన్నబ్రహ్మానందం, మల్లన్న, జ్యోతి, శ్రీకాంత్, అరుణ, సురేందర్, సారన్న, సయ్యద్ పాల్గొన్నారు.

రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా అంజన్న

దండేపల్లి: మండలంలోని లక్ష్మీకాంతపూర్ గ్రామానికి చెందిన జెల్లపెల్లి అంజన్న ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి నియామకపత్రం అందించారు.

పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలి


సమావేశమైన మధ్యాహ్న భోజన నిర్వాహకులు

కాసిపేట: మధ్యాహ్న భోజన కార్మికులకు నాలుగు నెలలుగా బిల్లులు, వేతనాలు రాకపోవడంతో అప్పుల పాలైనట్లు, వంట నిర్వహణకు మరిన్ని అప్పులు చేస్తున్నట్లు వాపోయారు. పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి డిమాండ్ చేశారు. మండలంలోని దేవాపూర్‌లో గురువారం మధ్యాహ్న భోజన నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు గురువక్క, కనక దేవేంద్ర, కొట్నాక సాంద్రుబాయి, సాయక్క, అంకమ్మ, మణెమ్మ, కమలాభాయి తదితరులు ఉన్నారు.

ఎస్ఎస్ఏల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

చెన్నూర్: ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్‌రావు అన్నారు. స్థానిక శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఎస్ఏలు పదిహేను రోజులుగా నిరవధిక సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. చాలీచాలని వేతనాలతో 18 సంవత్సరాలుగా విద్యాశాఖలో విధులు నిర్వర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తపస్ నాయకులు సింగిరెడ్డి సాంబయ్య, తొడె తిరుపతి, నూకల సురేశ్, దుర్గం చందు పాల్గొన్నారు.

బేస్‌క్యాంప్ సిబ్బందికి మార్చ్‌డ్రిల్

- అటవీ రక్షకుల ఆరోగ్యం కోసం..
- నెలలో నాలుగు రోజులు నిర్వహణ


మార్చ్‌డ్రిల్ చేస్తున్న బేస్‌క్యాంపు సిబ్బంది

జన్నారం: రాత్రీపగలు అడవి రక్షణలో భాగమైన బేస్‌క్యాంపు సిబ్బంది ఆరోగ్యం విషయంలో అటవీ శాఖ జాగ్రత్తలు తీసుకుంటోంది. ఉదయం నుంచి రాత్రి వరకు అడవి రక్షకులుగా పనిచేస్తున్న వారిని చురుగ్గా తయారు చేయడానికి ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో అటవీ శాఖ సిబ్బంది ఆరోగ్యం, ఫిట్‌నెస్ విషయంలో ప్రతీ వారం నిర్వహించే మార్చ్‌డ్రిల్ బేస్‌క్యాంప్ సిబ్బంది కూడా నిర్వహిస్తున్నారు. మొదట ఇందన్ పల్లిలో ప్రారంభించగా, తర్వాత జన్నారం అటవీ డివిజన్‌లోని తాళ్లపేట్, జన్నారం అటవీ రేంజ్‌లలో 10బేస్ క్యాంపులలో పనిచేస్తున్న 50మంది బేస్‌క్యాంపు సిబ్బందికి నెలలో నాలుగు రోజులు మార్చ్‌డ్రిల్ నిర్వహిస్తున్నారు.

రాత్రీ పగలు కాపలా..

జన్నారం అటవీ డివిజన్‌లోని మూడు అటవీ రేంజ్‌లలో పది బేస్‌క్యాంపులను ఏర్పాటు చేశారు. ఒక్కో బేస్‌క్యాంపులో ఐదుగురు చొప్పున సిబ్బందిని నియమించారు. ఉదయం, రాత్రి అడవిలో పెట్రోలింగ్ చేస్తూనే, శాఖపరమైన పనులు నిర్వహిస్తారు. అడవిలో ఏర్పాటు చేసిన క్యాంపులలోనే బస చేస్తూ అక్కడే వంట చేసుకొని ఉంటారు. అడవిలో రాత్రి ఏదైనా శబ్దం వినిపించినా, అలజడి అనిపించినా ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించి, అటవీ అధికారులకు సమాచారం ఇస్తారు. దీంతో అడవిలో స్మగ్లింగ్ తగ్గిపోతుందని అటవీ అధికారుల యోచన. వన్య ప్రాణుల వేట నిరోధం, అడవుల రక్షణలో అటవీశాఖ సిబ్బందికి చేదోడుగా నిలుస్తున్నారు.

మొదట ఇందన్‌పల్లి రేంజ్‌లో...

అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం డివిజన్‌లోని మూడు రేంజ్‌లలో బీట్, సెక్షన్ అధికారులతో పాటుగా, డీఆర్వోలు, ఎఫ్ఆర్వోలు ప్రతీ వారం మార్చ్‌డ్రిల్ నిర్వహిస్తుంటారు. అటవీ సిబ్బంది ఫిట్‌నెస్‌ను పరిశీలించడం, ఆరోగ్యం కాపాడుకునే విషయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బేస్‌క్యాంపు సిబ్బందికి కూడా మార్చ్‌డ్రిల్ నిర్వహించాలని రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ మొదటిసారిగా ఇందన్‌పల్లి అటవీ రేంజ్‌లో బేస్‌క్యాంపు సిబ్బందికి మార్చ్‌డ్రిల్ ప్రారంభించారు. గతనెల నుంచి ప్రారంభమైన ఈ మార్చ్‌డ్రిల్ నెలలో నాలుగు రోజులు నిర్వహిస్తున్నారు. రేంజ్ పరిధిలోని బేస్‌క్యాంపు సిబ్బంది రేంజ్ అధికారి ఆదేశానుసారంగా వారంలో నిర్ణయించిన తేదీలో కార్యాలయానికి వచ్చి డ్రిల్ చేస్తారు.

ఫిట్‌నెస్ పరిశీలించేందుకే...



రాత్రీ, పగలు, అడవిలో విధులు నిర్వర్తించే బేస్ క్యాంపు సిబ్బంది ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకునేందుకు, ఫిట్‌నెస్ ను పరిశీలించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం మార్చ్‌డ్రిల్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. మొదట ఇందర్‌పల్లి రేంజ్‌లో ప్రారంభించాం. తర్వాత మిగితా రేంజ్‌లలో కూడా అమలు చేస్తాం.

– కారం శ్రీనివాస్, అటవీ రేంజ్ అధికారి

'అన్నారం' వెలవెల



మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం సుందరశాల గ్రామ సమీపంలో గోదావరి నదిపై నిర్మించిన అన్నారం బ్యారేజీ నీరు లేక ఇలా వెలవెలబోతోంది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం బ్యారేజీ పిల్లర్ల వద్ద బుంగ పడడంతో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ బ్యారేజీలను ఖాళీ చేయాలని సూచించింది. దీంతో నీటిని వదిలేశారు. దీంతో మేడిగడ్డ ఇలా ఖాళీగా కనిపిస్తోంది. గతంలో మండు వేసవిలోనూ నిండు కుండను తలపించిన బ్యారేజీ ఇప్పుడు ఇలా వెలవెలబోతోంది. బ్యారేజీకి వెళ్లే రోడ్డు కూడా అధ్వానంగా మారింది.

- (చెన్నూర్‌రూరల్)



నేరాల నియంత్రణకు కార్డన్‌సెర్చ్


మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

కాసిపేట: నేరాల నియంత్రణకు పోలీసులు గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ పోగ్రామ్ (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహిస్తున్నట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్టేషన్ పెద్దనపల్లిలో గురువారం సీఐ ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్ సిబ్బందితో కలిసి ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు ఉంటున్నా, అపరిచితులకు షెల్టర్ ఇస్తున్నారా అనే అంశంలో అందరి ఆధార్‌కార్డులు పరిశీలించారు. ద్విచక్ర వాహనాలు, ఆటోరిక్షాల పత్రాలు పరిశీలించి సక్రమంగా లేని 27ద్విచక్ర వాహనాలు, 3ఆటోలకు జరిమానా విధించారు. నంబర్ ప్లేటు లేని 3వాహనాలు సీజ్ చేశారు. సైబర్ క్రైం, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ రూల్స్, కొత్త చట్టాలు, మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కాసిపేట, దేవాపూర్, రామకృష్ణాపూర్ ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు, రాజశేఖర్, నార్కోటిక్ డాగ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గాయకుల ఎంపిక పోటీలు


మాట్లాడుతున్న కళాకారులు

జన్నారం: ప్రముఖ ప్రజాకవి గాయకులు వరంగల్ శ్రీనివాస్ రచించిన నూరేండ్ల నా ఊరు గేయకావ్యం, ఓయమ్మ నా పల్లెసీమ పాట కోసం ఈ నెల 28న గాయనీ, గాయకుల ఎంపిక కార్యక్రమం జన్నారం మండల కేంద్రం పీఆర్టీయూ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు కళాకారులు కొండు జనార్దన్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గాయనీ గాయకులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని మీ ప్రతిభతో ఈ గేయ కావ్యంలో పాడే అవకాశాన్ని పొందాలని సూచించారు. 243చరణాలు కలిగిన ఈ గేయకావ్యంలో 243మంది ప్రతిభావంతులైన గాయనీ గాయకులతో పాడించనున్నట్లు తెలిపారు. సమావేశంలో కళాకారులు ముల్కల్ల మురళి, లింగంపల్లి రాజలింగు, లావుడ్యా రమేశ్, తుంగూరి గోపాల్, వెంకటేశ్, లవుడ్యా చందూలాల్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ

మందమర్రిరూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్ కల్పించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానికంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో, నామినేటెడ్ పోస్టుల్లో తదితర అంశాల్లో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రాధాన్యం ఇవ్వాలని, వెంటనే రూ.ఆరు వేల పింఛన్ అమలు చేయాలని, దివ్యాంగుల హక్కులను అమలు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు అప్పారావు, రమేశ్, రాం శ్రీనివాస్, సుశీల, ధనలక్ష్మి, భీమేశ్వరి తదితరులు ఉన్నారు.

భగవద్గీత పుస్తకాలు పంపిణీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక భక్తాంజనేయ ఆలయంలో గురువారం హిందూ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములకు భగవద్గీత పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో హిందూ పరిరక్షణ వేదిక ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం


గౌస్‌పాషాను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ 3గనిలో సంక్షేమ అధికారిగా పనిచేసి కొత్తగూడెంకు బదిలీపై వెళ్తున్న గౌస్‌పాషాను టీబీజీకేఎస్ నాయకులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. గనిపై గురువారం జరిగిన కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్‌లు గౌస్‌పాషాను శాలువాతో సత్కరించి ఆయన గనిలో చేసిన సేవలను కొనియాడారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు గోపియా నాయక్, ఉత్తేజ్ రెడ్డి, సాధుల భాస్కర్, వెంకట్‌రెడ్డి, సునీల్, గోపతి మల్లేష్, అల్లం రాజయ్య, అంబాల పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

జీవీటీసీలో రక్తదాన శిబిరం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని పాలచెట్టు వద్ద గల జీవీటీసీలో గురువారం సింగరేణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ హాజరై ప్రారంభించారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు, కార్మికులు ఉన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

శ్రీరాంపూర్: భారత రాజ్యాంగంపై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు నిరసన తెలిపారు. శ్రీరాంపూర్ ఓసీపీలో గురువారం నిరసన తెలిపారు. ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలన్నారు.

మెడికల్ బిల్లులు చెల్లించాలి

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు మెడికల్ బిల్లులు చెల్లించాలని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల అనారోగ్య కారణంతో ఏరియా ఆసుపత్రికి వెళ్తే అక్కడి వైద్యులు స్కానింగ్, ఇతర వ్యాధి నిర్ధారణ పరీక్షలను ప్రైవేటుగా చేయించుకొని రమ్మంటున్నారని తెలిపారు. ఆ ప్రైవేట్‌గా చేయించుకున్న పరీక్షలకు బిల్లులు ఇవ్వడం లేదన్నారు. వెంటనే వాటికి కూడా బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా స్కానింగ్, ఎంఆర్ఐ ఇతర వైద్య పరికరాలను కూడా కంపెనీ ఆసుపత్రుల్లోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పోరాటాలు, త్యాగాలకు ప్రతీక సీపీఐ

- ఘనంగా పార్టీ ఆవిర్భావ సంబురాలు
- అమరులకు విప్లవ జోహార్లు అర్పించి..
- అరుణ పతాకం ఆవిష్కరించిన నాయకులు


బెల్లంపల్లి: మాట్లాడుతున్న సీపీఐ నాయకులు


చెన్నూర్: జెండా ఎగురవేస్తున్న సీపీఐ నాయకులు

పాతమంచిర్యాల/బెల్లంపల్లి/కాసిపేట/చెన్నూర్/తాండూర్: ప్రజా పోరాటాలకు వెన్నుదన్నుగా తమపార్టీ ముందుకు సాగుతోందని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) నాయకులు అన్నారు. అమరుల రక్త తర్పణతో ఎర్రజెండా మరింత ఎరుపెక్కిందని పేర్కొన్నారు. సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా వ్యాప్తంగా, పలు మండల కేంద్రాల్లో సీపీఐ పార్టీ కార్యాలయాల వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అమరులకు విప్లవ జోహార్లు అర్పించారు. కేక్ కట్ చేశారు. భారత దేశ చరిత్రలో పేదల పక్షాన పోరాడుతున్న సీపీఐకి ప్రత్యేక స్థానం ఉందన్నారు. కార్మికులు, కష్టజీవులు, పేదల కోసం, హక్కుల సాధన కోసం అలుపెరుగని పోరాటాలు సాగిస్తోందని పేర్కొన్నారు. దేశంలో సీపీఐ ఆవిర్భవించి వందేళ్ల పూర్తి చేసుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. 1925సంవత్సరం డిసెంబర్ 26న సీపీఐ ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ఎర్రజెండా నీడలో ఎందరో ఉద్దండులు ప్రజా పోరాటాలు సాగించి అమరులయ్యారని గుర్తు చేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సీపీఐ పట్టణ కార్యాదర్శి ఖలీందర్ అలీఖాన్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కారుకూరి నగేష్, లింగం రవి, జిల్లా సమితి సభ్యులు, బెల్లంపల్లిలో ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యురాలు పూర్ణిమ, రాష్ట్ర సమితి సభ్యుడు ఎం.వెంకట స్వామి, జిల్లా సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమొగిలి, కాసిపేటలో సీపీఐ మండల కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యుడు దాగం మల్లేష్, చెన్నూర్‌లో మండల కార్యదర్శి నెన్నల సమ్మయ్య, తాండూర్‌లో సీపీఐ మండల కార్యదర్శి సాలిగామ సంతోష్, మండల సహాయకార్యదర్శి సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

గంజాయి పట్టివేత

భీమిని: కన్నెపల్లి మండలంలోని టేకులపల్లి పెట్రోల్ పంపు సమీపంలో గురువారం గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు. ఎస్సై గంగారం కథనం ప్రకారం ఇద్దరు వ్యక్తులు రాజు సర్కార్, షమీర్‌లు 1100గ్రాముల గంజాయిని బైక్‌పై తరలిస్తుండగా పక్కా సమాచారంతో దాడిచేసి టేకులపల్లి పెట్రోల్‌బంక్ వద్ద పట్టుకున్నామన్నారు. గంజాయి, బైక్‌ను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

తాండూర్: మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం రాత్రి మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. రెబ్బెన మండలం నుంచి తాండూర్ మండలానికి అక్రమంగా ఇసుక తీసుకొస్తున్న ట్రాక్టర్లను సిబ్బందితో కలిసి జిల్లా మైనింగ్ ఏడీ జగన్మోహన్‌రెడ్డి పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

జైపూర్: మంచిర్యాల–చెన్నూర్ 63వ జాతీయ రహదారిలో గల శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. జైపూర్ మండలం టేకుమట్లకు చెందిన ఇందారపు సంతోశ్ ఎస్టీపీపీలో పవర్‌మేక్ కంపెనీలోని ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. పని నిమిత్తం తన బైక్‌పై శ్రీరాంపూర్‌కు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. శ్రీరాంపూర్ వైపు నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తల తీవ్రగాయాలయ్యాయి. అతన్ని మంచిర్యాలలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ఆస్పత్రికి పంపించారు. కాగా ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం


దేవాపూర్‌లో కాలుతున్న ఇల్లు

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో గురువారం రాత్రి ఆత్రం సత్యవతికి చెందిన ఇల్లు అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. దేవాపూర్ అచ్యుతరావు గూడలో గిరిజన ఆశ్రమ పాఠశాల ఎదురుగా నివాసం ఉండే సత్యవతి ఇంట్లో దీపం పెట్టి పక్కింటిలో జరిగే పుట్టిన రోజు వేడుకలకు వెళ్లింది. ఈ క్రమంలో సిలిండర్ పేలి మంటలు వ్యాపించాయి. స్థానికులు, ఆదివాసీ సంఘాల నాయకులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశా రు. తడకలతో వేసిన పెంకుటిల్లు కావడంతో పూర్తిగా కాలిపోయింది. మంచం, బీరువా, టీవీ, వంటసామగ్రి, వస్తువులు కాలిపోయాయి. సంఘటనా స్థలాన్ని దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు పరిశీలించారు.

తొలగించిన పైపులు దగ్ధం


దగ్ధమవుతున్న పైపులు

దండేపల్లి: మండలంలోని గూడెం ఎత్తిపోతల పథకం పంప్‌హౌజ్ సమీపంలో 3 కి.మీ మేర జీఆర్పీ పైపులు తొలగించి వాటి స్థానంలో ఎమ్మెస్ పైపులు వేశారు. అయితే తొలగించిన పైపులు పక్కన పెట్టి ఉంచారు. వాటిలో కొన్నింటికి గుర్తుతెలియని వ్యక్తులు గురువారం నిప్పంటించారు. మంటలు రావడంతో గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడికి వారు చేరుకుని మంటలార్పివేశారు.

ఘనంగా వీర్ బాల దివస్


భీమారం: నివాళులర్పిస్తున్న నాయకులు

భీమారం/చెన్నూర్/కోటపల్లి/మందమర్రిరూరల్: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం వీర్ బాల దివస్ ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయాల్లో ఇస్లామిక్ మతోన్మాదానికి బలైపోయిన అమరవీరుల చిత్ర పటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో చెన్నూర్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, నాయకులు కొండపాక చారి, కమ్మల శ్రీనివాస్, బత్తుల సమ్మయ్య, రాజబాపు, బొజ్జ పోచం, దివాకర్‌శర్మ, కోటపల్లిలో మాజీ ఎంపీపీ మంత్రిసురేఖ, మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య, మందమర్రిలో బీజేపీ మండల అధ్యక్షుడు సుంకరి రాజేందర్, భీమారంలో బీజేపీ జిల్లా నాయకులు శ్రీనివాస్, మండల బీజేపీ అధ్యక్షుడు బోర్లకుంట శంకర్, సిక్కుమతస్తులు దుదాని అమృత్ సింగ్, జగదీష్‌సింగ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 23న మంచిర్యాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో మంచిర్యాల జిల్లా జట్టు ప్రథమ స్థానం దక్కించుకుంది. ఈ పోటీల్లో తాండూర్ మండలం అచ్చులాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎం.అమూల్య అనే విద్యార్థినీ అత్యంత ప్రతిభ కనబర్చి అందరి దృష్టిని ఆకర్షించడంతో సీఎం కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి సీఎం కప్ బాలబాలికల వాలీబాల్ పోటీలు ఈ నెల 27నుంచి 30వ తేదీ వరకు ఖమ్మం జిల్లాలో జరగనున్నాయి. అమూల్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఉపాధ్యాయులు, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ ఫణిరాజా ప్రత్యేకంగా అభినందించారు.